క్లుప్తంగా

పాఠశాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ఎంఈవో ఆర్.శోభాచంద్



నిజాంపట్నం: పాఠశాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి ఆర్.శోభాచంద్ చెప్పారు. వార్షిక తనిఖీలలో భాగంగా మండలంలోని నక్షత్రనగర్ ప్రాథమిక పాఠశాల, మండల కేంద్రమైన నిజాంపట్నంలోని ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. మధ్యాహ్న భోజన పథకం రికార్డులు సైతం తప్పొప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శేషగోపాలం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏబీఆర్ డిగ్రీ కళాశాలకు 'ఏ' గ్రేడ్ ప్రదానం



రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యా విషయక అంశాలపై కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ మార్గదర్శకాల ప్రకారం గురువారం అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. అకడమిక్ ఆడిట్‌లో చీరాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రాజశేఖరరెడ్డి, బాపట్ల మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు షేక్ అబ్దుల్ కలాంలు పలు అంశాలను పరిశీలించారు. కళాశాలలోని తరగతి గదులు, సెమినార్ హాలు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పనితీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలకు ఏ గ్రేడ్ పత్రాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్, ఐక్యూఏ కో ఆర్డినేటర్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి కిట్‌లు అందజేత

నగరం: దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు మద్ది సత్యనారయణ చెప్పారు. మండలంలోని ధూళిపూడి తడవర్తి బాపయ్య స్మారకోన్నత పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలోని 23 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్‌లను విశ్రాంత న్యాయమూర్తి ప్రసాదరావు, మండల ఎంఈఎఫ్ అధ్యక్షుడు ఎస్ వెంకట సుబ్బయ్యలు అందించారన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.

ఆదరణ-3పై అవగాహన



కర్లపాలెం: చేతి వృత్తుల వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆదరణ పథకాన్ని అమలు చేస్తుందని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ కులాల వారికి ఆదరణ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదరణ పథకం-3లో చేతి వృత్తుల వారికి కావలసిన వివిధ రకాలైన పనిముట్లను అందించనుందని చెప్పారు. చేతి వృత్తుల వారికి అందించనున్న పనిముట్లు వాటి కంపెనీల గురించి ఎంపీడీవో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రజని తదితరులు ఉన్నారు.

మెటల్ లోడ్ లారీ బోల్తా



కొల్లూరు : మెటల్ లోడ్‌తో ప్రయాణిస్తున్న లారీ బోల్తా కొట్టిన ఘటన గురువారం మండలంలోని రావికంపాడులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... కొల్లూరుకు చెందిన లారీ గుంటూరు నుంచి మెటల్ లోడ్‌తో రావికంపాడు ఎస్సీ కాలనీ వైపు వెళుతుంది. అధిక లోడ్‌తో లారీ కాలువకట్టపైన ఉన్న సీసీ రోడ్డులోకి ప్రవేశించడంతో రోడ్డు ఓవైపు పగిలిపోయి లారీ ఓ పక్కకు పల్టీ కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలవడంతో స్థానికులు 108 వాహనంలో తెనాలి వైద్యశాలకు తరలించారు.

భవనం పూర్తి కాదు... కల నెరవేరదు

- అంబేడ్కర్ భవన నిర్మాణానికి కూటమి గ్రహణం
- గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయిన పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పూర్తి చేసి వినియోగంలోకి తేవాలంటున్న దళిత సంఘాలు



90 శాతం పూర్తయిన అంబేడ్కర్ భవన నిర్మాణం

రేపల్లె రూరల్: అంబేడ్కర్ భవన నిర్మాణానికి కుటమి గ్రహణం పట్టింది. భవన నిర్మాణంపై నేతలు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. 90 శాతం పూర్తయిన భవన నిర్మాణ పనులను పూర్తి చేసి దళితులకు అందించేందుకు పాలకులు నిర్లక్ష్యం వహించటంతో భవనం తుది దశ పనులు నిలిచిపోయాయి. దళితుల చిరకాల స్వప్నాన్ని కూటమి ప్రభుత్వం చిదిమేస్తోందనటానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయిన భవన నిర్మాణ పనులు ప్రస్తుతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ భవన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చేనా అని దళితులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రూ.1.15 కోట్లు మంజూరు

తీర ప్రాంత దళితుల 30 సంవత్సరాల చిరకాల స్వప్నమైన అంబేడ్కర్ భవన నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్లో 15 సెంట్ల స్థలం కేటాయించి విశాలమైన భవన నిర్మాణానికి రూ.1.15 కోట్ల నిధులను మంజూరు చేసింది. భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి దళితులకు కానుకగా అందించాలన్న సంకల్పంతో భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి 90 శాతం పైగా పూర్తి చేసింది. ఎన్నికల కోడ్ రావడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ తుది దశ పనులను పూర్తిగా విస్మరించింది. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా భవనాన్ని పూర్తి చేసేందుకు ఇటు పాలకులు అటు అధికారులు కనీసం శ్రద్ధ చూపకపోవడంతో దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

వినియోగంలోకి వస్తే ఉపయోగం

భవనం వినియోగంలోకి వస్తే తీర ప్రాంతంలోని దళిత సంఘాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 30 సంవత్సరాలకుపైగా దళిత సంఘాలు ఐక్యంగా చేస్తున్న పోరాటాలకు ఫలితం వస్తుంది. సామాజిక వర్గంకు సంబంధించిన సభలు, సమావేశాలు, చిన్న పాటి వేడుకలు నిర్వహించుకునేందుకు చక్కటి వేదిక లభిస్తుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని దళితులు, దళిత సంఘాల వారు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు 90 శాతం వరకు పూర్తి అయ్యాయి. భవనంకు ఫ్లోరింగ్, కిటికీ, దర్వాజాలకు తలుపులు, పెయింట్స్, వాటర్ పైప్ లైనింగ్, ఇతర ఫినిషింగ్ పనులు చేయాల్సి ఉంది. మిగిలిన పనులకై రూ.20 లక్షల వరకు అవసరమని నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం.

– చక్రవర్తి, ఏఈ, పంచాయతీరాజ్

ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచులే ముద్దు

మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు



రేపల్లె రూరల్: ప్లాస్టిక్ వినియోగం వద్దని, గుడ్డ సంచులే ముద్దని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు అన్నారు. పాలిథిన్ నివారణ కార్యక్రమాలలో భాగంగా మార్కెట్ సెంటరులో గురువారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పాలిథిన్ భూమిలో కలిసిపోవటానికి వేల సంవత్సరాలు పడుతుందన్నారు. అంతేకాకుండా భూమి కాలుష్యమై వాతావరణం సమతౌల్యం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గుడ్డతో చేసిన సంచులు గానీ, జూట్‌తో తయారు చేసిన బ్యాగ్‌లు గానీ వినియోగించాలన్నారు. ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించి పర్యావరణ హితులుగా మారాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఓల్డ్‌టౌన్‌లోని పలు ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయటం జరుగుతుందని ఆ శాఖ పట్టణ ఏఈ ఎ.శివనాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవపల్లి రోడ్డు, పెనుమూడి రోడ్డు, గూనివారిపాలెం, తూర్పు హరిజనవాడ, అంకమ్మ చెట్టు సెంటర్‌లలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయటం జరుగుతుందని తెలిపారు.

తిరుపతమ్మ తల్లికి పూజలు



బలిజేపల్లి(వేమూరు): మండలంలోని బలిజేపల్లి గ్రామంలో తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి పూజలు నిర్వహించారు. రాత్రి భక్తులు పసుపు బండ్లతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని పుసుపుతో పూజించడం జరుగుతుందని పూజారి చావలి సుధాకర్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి గుడి వద్ద పొంగళ్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా తిరునాళ్ల మహోత్సవాలు



విద్యుత్ దీపాల వెలుగులో దోనేపూడి తిరుపతమ్మ తల్లి ఆలయం



ప్రత్యేక అలంకరంలో అమ్మవారు

కొల్లూరు : తిరునాళ్ల మహోత్సవాలతో కొల్లూరు మండలంలో సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని దోనేపూడి తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల, పెసర్లంకలోని నాంచారమ్మ తల్లి తిరునాళ్ల, కొల్లూరు వైష్ణవాలయం తిరునాళ్ల మహోత్సవాలు గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తుల కోలాహలం నడుమ నిర్వహించిన తిరునాళ్లలో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసాయి. దోనేపూడిలో ఉదయం నుంచి భక్తులు దైవదర్శనానికి పోటీపడ్డారు. ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్లలో పొంగళ్లు తయారు చేసుకుని మొక్కులు చెల్లించుకోవడంలో మహిళలు భక్తిశ్రద్ధలు కనబర్చారు. అధిక సంఖ్యలో వాహనాలు, పశువులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన తిరుపతమ్మ తల్లిని దర్శించుకుని భక్తులు భక్తపారవశ్యంలో మునిగితేలారు. ఆలయం ఎదురు ఏర్పాటు చేసిన దుకాణాలు, క్రీడా వినోద పరికరాల ప్రాంతంలో ప్రజల కోలాహలంతో సందడి నెలకొంది. మండలంలోని పెసర్లంక నాంచరమ్మతల్లి తిరునాళ్లకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దైవదర్శనం చేసుకున్నారు. ఆలయం చుట్టూ మూగజీవాలు, వాహనాల ప్రదక్షిణలతో ఆలయ ప్రాంతం రద్దీగా మారింది. రాత్రివేళలో జరిగే తిరునాళ్ల అయినప్పటికీ ఉదయం నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉంది. కొల్లూరు వైష్ణవాలయం వద్ద నిర్వహించిన తిరునాళ్ల అనంతరం దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మండలంలో 5 పరీక్ష కేంద్రాలు

ఎంఈవో నీలం దేవరాజు



భట్టిప్రోలు: మరో మూడు రోజుల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో నీలం దేవరాజు గురువారం తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో భట్టిప్రోలు మండలం నుంచి 753 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. భట్టిప్రోలు మండలంలో టీఎంరావు హైస్కూల్ (భట్టిప్రోలు), ఐలవరం, వెల్లటూరు, పెదపులివర్రు, పల్లెకోన జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు 47 మంది ఇన్విజిలేటర్లు, ఐదుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను నియమించినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి 12:45 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రశ్న పత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్ర పరచడం జరిగిందన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఏపీఎస్ ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించినట్లు తెలిపారు.

వాసవీ క్లబ్, కుబేర వనిత ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు వాసవీ క్లబ్, కుబేర వనిత ఆధ్వర్యంలో మల్లేశ్వరుని రథోత్సవ కార్యక్రమంలో భాగంగా భక్తులకు గురువారం మజ్జిగ పంపిణీ ఏర్పాటు నిర్వహించారు. అలాగే రీజియన్ చైర్ పర్సన్ అవగాహన పర్యటన సందర్భంగా మంచినీటి కుండలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రతినిధిగా రీజియన్ చైర్ పర్సన్ వైవీఎన్ రాఘవేంద్ర, సెక్రటరీ చందలూరి శివబ్రహ్మయ్య, సిల్వర్ స్టార్ కేసీజీఎఫ్ బొలిశెట్టి శ్రీనివాసరావు (బీఎస్సార్), జిల్లా ఆఫీసర్ బూర్లె రామప్రసాద్, వాసవీ క్లబ్, కుబేర వనిత నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బూరుగులమ్మ అమ్మవారికి సారె మహోత్సవం

రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లో వేంచేసియున్న గ్రామ దేవత బూరుగులమ్మ అమ్మవారికి ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సారె మహోత్సవం నిర్వహించబడునని ఆలయ అర్చకులు నందివెలుగు భాను సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంకమ్మ చెట్టు సెంటరు నుంచి ఊరేగింపుగా మిఠాయిలు, పండ్లు, గాజులు, పసుపు, కుంకుమలతో పాటు వడిగంటి బియ్యంను అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి సమర్పించటం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విజన్ బిల్డింగ్‌పై శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీమన్నారాయణ

భట్టిప్రోలు: ప్రతి మహిళా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా అసంఘటిత రంగంలో పని చేసే వారు పేర్లు నమోదు చేయించుకోవాలని భట్టిప్రోలు మండల సమాఖ్య ఏపీఎం జి.శ్రీమన్నారాయణ తెలిపారు. 3 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై మండల పరిధిలోని గ్రామ సంఘాల అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశాలలోని సభ్యులందరికి తెలిసేలా ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు హనోక్, రజని, నరేంద్ర, అకౌంటెంట్ శిరీష, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

నేడు బేతపూడమ్మ అమ్మవారి తిరునాళ్ల



బేతపూడమ్మ అమ్మవారు

రేపల్లె రూరల్: ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని బేతపూడి గ్రామంలో వేంచేసియున్న బేతపూడమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవానికి ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పూర్తి చేశారు. శుక్రవారం నిర్వహించే తిరునాళ్ల మహోత్సవానికి ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు ఆలయం వెనుక ఉన్న నాగేంద్రస్వామి పుట్ట ఆలయాన్ని సైతం చూపరులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. పొంగుళ్లు పెట్టుకునేందుకు, అమ్మవారికి, పోతురాజు స్వామి వార్లకు సద్ది నైవేద్యాలు సమర్పించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన శేషమ్మ

బాపట్లటౌన్ : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలోని పాతబస్టాండ్‌లో చోటుచేసుకుంది. పర్చూరు మండలం, చెరుకూరు గ్రామానికి నెల్లూరి శేషమ్మ(50) కుమార్తెకు పట్టణంలోని కారుమూరి హనుమంతరావు కాలనీకి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. కుమార్తె ఇంటికి వచ్చేందుకు ఉదయం బస్టాండ్‌లో దిగి రోడ్డు దాటుతుండగా బాపట్ల నుంచి పొన్నూరు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో శేషమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

విద్యార్థులు పరిశోధనలపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారయణ

నగరం: విద్యార్థులు సమకాలీన సాంకేతికతలు అందుకోవడంలో ముందుండాలని ప్రొఫెసర్ మెండు సత్యనారయణ చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో గురువారం పారిశ్రామిక అనువర్తనాలలో కృత్రిమ మేధో సాంకేతికతల ఉపయోగం అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో కృత్రిమ ఆధారిత కోర్సులకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. విద్యార్థులు పరిశోధనలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ దిశగా అధ్యాపకులు చర్యలు చేపట్టాలన్నారు. బయో మెడికల్ సెన్సార్స్, నానో నిర్మిత రసాయన పదార్థాలలో కృత్రిమ మేధా ప్రాధాన్యతలపై వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సురేంద్రరెడ్డి, కరస్పాండెంట్ బుచ్చియ్యచౌదరి, ప్రిన్సిపాల్ హరికృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీవీ వెంకటేశ్వరావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకట నారయణ, పీ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ప్రజలను జాగృతం చేసిన రాయప్రోలు

ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ సాయిబాబు



రాయప్రోలు సుబ్బారావు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఫోరం ఫర్ బెటర్ బాపట్ల నాయకులు

బాపట్ల: తన అద్భుతమైన దేశభక్తి కవిత్వంతో ప్రజలను జాగృతం చేసిన మహాకవి రాయప్రోలు సుబ్బారావు అందరికి ఆదర్శనీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. రాయప్రోలు సుబ్బారావు జయంతి సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ 'ఏ దేశమేగినా, ఎందు కాలిడినా, పొగడరా నీ తల్లి భూమి భారతిని' అంటూ రాయప్రోలు నినదించారని గుర్తు చేశారు. తెలుగు జాతి అన్నా, తెలుగు భాష, తెలుగు సంస్కృతి అన్నా ఆయనకు వల్లమాలిన అభిమానమని తెలిపారు. తెలుగు తల్లి అనే భావనకు ఆయనే ప్రాణం పోశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.రాజశ్రీ, ఉపాధ్యాయులు బుజ్జి, శ్రీదేవి, పూర్ణశంకరరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి గ్రామోత్సవం



నంది వాహనంపై గ్రామోత్సవం

చినపరిమి(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చినపరిమి గ్రామంలో గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ఉదయం నిత్య హోమం బలిహరణ, తలంబ్రాల సేవ, నిర్వహించారు. నంది వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిత్య హోమం బలిహరణ, రథాంగ హోమం, దివ్య రథోత్సవం, అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీవో నాగలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి

నిజాంపట్నం: వెనుకబడిన తరగతుల వర్గాలకు చేయూతనివ్వటమే లక్ష్యంగా ప్రభుత్వం ఆదరణ పేరుతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వెనుకబడిన బీసీ ఉపకులాలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సబ్సిడీ రుణాలు అందిస్తోందన్నారు. ప్రస్తుతం ఆదరణ-3 పథకం కింద బట్టల తయారీ, కమ్మరి, కంచు పని, వడ్రంగి, నాయీ బ్రాహ్మణ, రజక, భవన నిర్మాణం, దర్జీ, నేత పని, స్వర్ణకారులు, పాల వ్యాపారం తదితర రంగాలలో ఆసక్తి ఉన్న వారికి వ్యాపారాలు చేసుకునే విధంగా ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందిస్తోందన్నారు. నిర్ణీత తేదీలలో లబ్ధిదారులు పథకాలకు దరఖాస్తు చేసుకుని వ్యాపారాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ నాజర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పత్రాలపై అవగాహన



ఖాజీపాలెం(కర్లపాలెం): సాగు భూములలో మట్టి నమూనాలను పరీక్షించి భూమిలో ఉండే పలు రకాల సూక్ష్మధాతు లోపాలను గుర్తించి అవసరమైన ఎరువులను వేయవచ్చునని ఎంఎస్‌టీఎల్ ఏడీఏ అనూరాధ చెప్పారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం మండల పరిధిలోని ఖాజీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మట్టి నమూనా పత్రాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ అనూరాధ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించటం వలన భూమిలో ఉండే జింకు ధాతు లోపాలను గుర్తించి సరిచేసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. అవసరమైన ఎరువులు మాత్రమే వేసేందుకు మట్టి నమూనా పరీక్షలు దోహదపడతాయని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో సత్యానంద్, ఎంఎస్‌టీఎల్ ఏవో వెంకటేష్, విస్తరణాధికారి శేషమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

గొరిగపూడిలో పునః ప్రతిష్టా మహోత్సవాలు



పునఃప్రతిష్టా మహోత్సవంలో నిర్వహిస్తున్న పూజలు

గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండల క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన గొరిగపూడి గ్రామ దేవత దేశమ్మ తల్లి దివ్య ఆశీస్సులతో భ్రమరి దుర్గాదేవి సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో జీవధ్వజ విమాన గోపుర శిఖర సహిత పునః ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా గురువారం పూజలు జరిగాయి. మండప దేవత పూజలు, అగ్ని ప్రతిష్టాపనము, అగ్నికుండ సంస్కారము, అన్యకుండ అగ్ని విస్తరణము, జిహ్వాది హోమాలతో ఆవరణ దేవతలు, ప్రాతరౌపాసన ప్రాతః కాల దీక్షా హోమాలు జరిగాయి. దేవతానుష్టానములు, మహన్యాస పూర్వక రుద్రాభిషేక హోమాలు, వివిధ ప్రతిష్టాపన మూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య, రుద్ర హోమాలు అనంతరం మంత్రపుష్పం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ కావించారు. ఫణికుమార్ ఆధ్వర్యంలో పూర్వ గ్రామ కరణం, పులిగడ్డ వారి వంశస్తుల సహాయ సహకారాలతో బ్రహ్మశ్రీ సృజన్ కుమార్ ఆధ్వర్యంలో ఆచార్య అర్చక పర్యవేక్షణలో పూజలు జరుగుతున్నాయి. సర్పంచ్ గరిగపాటి మల్లికావెంకటేశ్వరరావు, ఆలయ అర్చకులు ఆమంచి సృజన్ కుమార్, కార్యనిర్వహణాధికారి పాపని రాజేశ్వరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ కార్యక్రమాలను పర్యవేక్షించారు.